క్లుప్తంగా...

మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు



మంత్రి కిషన్‌రెడ్డికి బయోడేటా అందజేస్తున్న రఘునందన్ యాదవ్

అబిడ్స్: కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు కలిశారు. గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునందన్ యాదవ్ తన బయోడేటాను కిషన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రఘునందన్ యాదవ్ మాట్లాడుతూ.... 43 ఏళ్లగా బీజేపీలో ఒక క్రమశిక్షణ గల కార్యకర్తగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న తనకు టికెట్టు కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు.

టీఎన్జీఓస్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం



అబిడ్స్: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి వద్ద దాదాపు 600 మందికి పరిపుష్టమైన అల్పాహారాలు అందించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఎంఏ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు

రంగారెడ్డి కోర్టులు: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1500ల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 3వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ కొత్త రవి బుధవారం తీర్పు ఇచ్చారు. ఏపీపీ జె.గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. 2020 మార్చి నెలలో నిందితుడు భాస్కర్ రెడ్డికి బాధితురాలితో పెళ్లైంది. ఏడాది పాటు వారి వైవాహిక జీవితం సాఫీగా సాగింది. ఆ తర్వాత ప్రతీ చిన్న విషయానికి భర్త భార్యతో గొడవపడటంతో పాటు అదనపు కట్నం కోసం వేధించేవాడు. వేధింపులు తాళలేక బాధితురాలు 2022 అక్టోబర్‌లో సరూర్‌నగర్ మహిళా పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. సాక్షులను విచారించిన మేజిస్ట్రేట్ నిందితుడు భాస్కర్ రెడ్డికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తుది తీర్పు వెల్లడించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: వాషింగ్ మిషీన్ బిగించేందుకు వచ్చి బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి రంగారెడ్డి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ కె.రాజిరెడ్డి కథనం ప్రకారం... మియాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌లో వాషింగ్ మిషీన్ బిగించేందుకు నిందితుడు షేక్ మౌలాలి వచ్చాడు. ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో అదే ఫ్లాట్‌కు ఆడుకునేందుకు వచ్చిన పక్క బ్లాక్‌కు చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. అదే సమయంలో ఫ్లాట్ యజమానురాలు రావడంతో బాలికను వదిలి పెట్టాడు. బాలిక విషయాన్ని తల్లికి చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు 2019లో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి బుధవారం నిందితుడికి మూడేళ్ల జైలు, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

అక్రమ భవన నిర్మాణాన్ని అడ్డుకోండి

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ చైతన్యనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ యజమాని రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని చైతన్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డిలు ఎల్బీనగర్ సర్కిల్ డీసీ రవీందర్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. రాత్రికి రాత్రే కాలనీకి చెందిన గోడను ఆగ్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, తాము అడిగితే తమకు అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతున్నాడని వారు పేర్కొన్నారు. కాలనీకి వెళ్లే రహదారిని ఆక్రమిస్తే రోడ్డు కుంచించుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు. గతంలో ఇక్కడ అక్రమంగా భవనాన్ని నిర్మిస్తే జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారని, తిరిగి నిర్మాణం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డీసీని విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- ఓటర్లకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు
- లైసెన్స్ ఆయుధాలను పోలీసు స్టేషన్లలో డిపాజిట్ చేయాలి
- ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలి
- సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి
- చాంద్రాయణగుట్ట నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి సూర్యప్రకాష్

చార్మినార్: చాంద్రాయణగుట్ట నియోజక వర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యామని నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, హైదరాబాద్ డివిజన్ ఆర్డీఓ సూర్యప్రకాష్ తెలిపారు. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎంతో ప్రతిష్టాత్మకమైందని... ఇక్కడ ఎన్నికలకు సంబంధించి అవసరమైన అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ఓటర్లకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

☛ నియోజకవర్గంలోని 305 పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన ముందస్తు చర్యలన్నింటిని తీసుకుంటామని సాక్షి కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.



◆ **నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు**

జవాబు: మొత్తం ఓటర్లు 3,28,293 ఉండగా... ఇందులో 1,64,437 మంది పురుషులు, 1,63,825 మంది మహిళ ఓటర్లుండగా..31 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు.

సహాయ రిటర్నింగ్ అధికారులున్నారులు ఎవరంటే..

◆ నియోజకవర్గానికి నలుగురు సహాయ రిటరి్నంగ్ అధికారులున్నారులు ఉన్నారు. జయమ్మ(బండ్లగూడ తహసీల్దార్), సురేందర్(జీహెచ్‌యంసీ సర్కిల్-8 డీసీ), ఆర్‌కే మహేందర్‌రెడ్డి(జీహెచ్ఎంసీ సర్కిల్-8, ఏఎంసీ), శ్రీధర్ ప్రసాద్(సర్కిల్-8 ఏసీపీ)

ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

◆ రిటర్నింగ్ అధికారితో పాటు నలుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 27 మంది సెక్టోరల్ ఆఫీసర్లు, 27 మంది సెక్టోరల్ పోలీసు ఆఫీసర్లు, మోడల్ కోర్ కండక్ట్ టీమ్‌లు, వీడియో రికార్డింగ్ టీమ్‌లు, అకౌంటింగ్ టీమ్‌లు... ఇలా పలు రకాల టీమ్‌లు ఎన్నికల సరళిని పరిశీలించనున్నారు.

నామినేషన్లు ఎక్కడ దాఖలు చేయాలంటే..

◆ ఫలక్‌నుమాలోని బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలోనే చాంద్రాయణగుట్ట నియోజక వర్గం రిటర్నింగ్ ఆఫీస్ కొనసాగుతుంది. ఇక్కడే నామినేషన్లను దాఖలు చేయాలి

ప్రతి రూపాయికీ లెక్క చెప్పాలి

జవాబు: ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చింది. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి తప్పనిసరిగా రాత పూర్వకంగా దరఖాస్తులు చేసుకుని తమ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఎప్పటికప్పుడు ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రతి రూపాయి లెక్క చెప్పాల్సి ఉంటుంది. ఇప్పటికే లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉంటే సంబంధిత పోలీసు స్టేషన్లలో డిపాజిట్ చేయాలి.

ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటచారి

యాకుత్‌పురా: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని యాకుత్‌పురా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటచారి అన్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా ఆర్వో ఆధ్వర్యంలో బుధవారం తన కార్యాలయంలో పలు పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి చర్యలకు పాల్పడిన కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు జి.నరసింహా, కృష్ణ కుమార్, ఏఎంసీ సురేందర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ స్వామి పాల్గొన్నారు.



పార్టీల నాయకులతో సమావేశమైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటచారి

బీఆర్ఎస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు



కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకులతో కురాకుల కృష్ణ

గోల్కొండ: అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్పి ఇంటికి పంపుతారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం కార్వాన్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం జరిగింది. కేసీఆర్ ప్రజలను దోచుకున్నారే తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఆయన ఆరోపించారు. సంక్షేమ పథకాలంటూ అప్పులు తెచ్చిన డబ్బు బీఆర్ఎస్ నాయకులకు అప్పజెప్పారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, అమిత్‌ఖాన్, రాములు తదితరులున్నారు.

మురుగు సమస్య లేకుండా చూడండి



జలమండలి డీజీఎంతో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే

గోల్కొండ: డ్రైనేజీ పూడికలకు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన షేక్‌పేట్‌లోని జలమండలి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైనేజీ పూడిక తీతకు అందుబాటులో ఉన్న యంత్రాలను అడిగి తెలుసుకున్నారు. జలమండలి క్షేత్రస్థాయి సిబ్బంది మరింత సమర్థతతో పని చేయాలని కొత్తగా వచ్చిన వాహనాలను సక్రమంగా వినియోగించుకుంటూ ఎక్కడ కూడా డ్రైనేజీ పొంగకుండా చూడాలన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, బద్రుద్దీన్, జలమండలి సిబ్బంది తదితరులున్నారు.

సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

సైదాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. సైదాబాద్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ, బోనాల పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటున్నామని, అదేవిధంగా సదర్‌కు కూడా గుర్తింపు ఇవ్వాలన్నారు. గతేడాది మన్నెగూడలో నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళన సభలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ సదర్ వేడుకలను సైతం అధికారికంగా నిర్వహించుకుందామని ప్రకటించారని గుర్తు చేశారు. సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు శ్రీశైలం, బత్తుల మహేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషిచేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

గోల్కొండ: ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు గెలిచిప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ అడ్‌హక్ కమిటి సభ్యులు కె.శేఖర్‌రెడ్డి కార్యాలయంలో బీఆర్ఎస్ సమావేశం జరిగింది. ఓటింగ్ శాతం పెంచడం బీఆర్ఎస్ నాయకుల ప్రథమ కర్తవ్యం అన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాల వల్ల వేలాది కుటుంబాలు లబ్ధిపొందాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ కాలం చెల్లి గడువు తీరిన పార్టీ అని ఆ పార్టీకి దేశ ప్రజలందరు తిరస్కరిస్తున్నారని అన్నారు. గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బండారి ప్రకాష్, కె.శేఖర్‌రెడ్డి, తూంకుంట అరుణ్‌కుమార్, కె.వెంకటేష్ తదితరులున్నారు.

ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి

సంతోష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పూనపాటి శివచంద్ర సూచించారు. ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం ఆయన స్టేషన్‌లో అడిషనల్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నియమావళిని అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకునే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

ఉద్యోగ నైపుణ్యాలు పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న యునైటెడ్ వే హైదరాబాద్ చాప్టర్ మేనేజర్ సుమన బొమ్ము

చార్మినార్: కేవలం డిగ్రీ పట్టాతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందలేమని... తగిన ఉద్యోగ సంసిద్ధ నైపుణ్యాలను పెంపుదల చేసుకున్నప్పుడే మంచి ఉద్యోగాన్ని సంపాదించగలుగుతారని యునైటెడ్‌వే హైదరాబాద్ చాప్టర్ మేనేజర్ సుమన బొమ్ము అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలంగాణ జ్ఞాన నైపుణ్యాల కేంద్రంతో కలిసి డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు జాబ్ రెడీనెస్ కార్యక్రమం ప్రారంభ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమ ఎన్జీవో ద్వారా దేశ వ్యాప్తంగా ప్రముఖ నగరాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని... హైదరాబాద్ విభాగం నుండి నగరంలోని ప్రముఖ కళాశాలల విద్యార్థులకు వివిధ నైపుణ్యాలను అందిస్తామన్నారు. సభకు అధ్యక్షతన వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులంతా దశల వారిగా వారందించే శిక్షణ తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఝాన్సీ, డాక్టర్ జె.నీరజా, డాక్టర్ దయానంద్, అవంతి, సంతోష్, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాటల పోటీలు



కళాకారులను సన్మానిస్తున్న వకులాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: సంగీతంలో కమ్మదనం.. పాటలో గొప్పతనం ఇమిడి ఉంటాయని తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో కళావేదిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ది వాయిస్ ఆఫ్ కళావేదిక సింగ్ ఛాలెంజ్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ప్రముఖ నిర్మాత ఆర్‌వి.రమణ నిర్మించిన చిత్రాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని కొనియాడారు. తండ్రి ఆశయ సాధన కోసం ఆయన కుమార్తె ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ వేణుగోపాలచారి, కళావేదిక వ్యవస్థాపకురాలు భువన తదితరులు పాల్గొన్నారు.

ఈసారి ఘనంగా విజయ దశమి మహోత్సవాలు



మాట్లాడుతున్న పంకజ్ కుమార్ అగర్వాల్

చార్మినార్: ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా హిందూ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు పంజక్ కుమార్ అగర్వాల్ తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పంకజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీన ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో సురేంద్ర, నార్నొలి, రాజ్ కమల్ భట్టాడ్, తరుణ్ అగర్వాల్, అనూప్ అగర్వాల్, హరిభాయ్, అలోక్ అగర్వాల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కళలతో ఒత్తిడి మాయం

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిడిని తగ్గించి ఆనందానుభూతుల్ని కలిగించే శక్తి కళలకు ఉందని కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్శిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో కృష్టా తృష్ణ కలెక్టివ్ షేడ్స్ పేరిట ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనను ఆయన శంకరాభరణం (పాత) సినిమా ఫేమ్ హీరోయిని తులసితో కలిసి బుధవారం ప్రారంభించారు. కళల ద్వారా సమాజాన్ని ఉత్తేజపరిచి చైతన్యవంతం చేయవచ్చన్నారు. ఆకట్టుకునే ఉత్తర్వులు అందమైన కళాఖండాలు ఆలోచింపజేస్తున్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 15 వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిలకించవచ్చన్నారు. కార్యక్రమంలో కె.సజయ, రమేష్‌బాబు ఓమ్నీ పాల్గొన్నారు.



కళాప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

జర్నలిజం నిర్మాణాత్మక పాత్ర పోషించాలి



పురస్కారాలను అందజేస్తున్న హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ

గన్‌ఫౌండ్రీ: ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛ చాలా అవసరమని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ, మాతృభూమి ఫౌండేషన్ల ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులకు జాతీయ ఉత్తమ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సమాజంలో పత్రిక స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్య మనుగడ కష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, బీసీ కమీషన్ ఛైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మైమరిపించిన నృత్యం



గన్‌ఫౌండ్రీ: శాంకరి కూచిపూడి డ్యాన్స్, మ్యూజిక్ అకాడమి 15వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. శ్రీపద లాస్యం పేరిట చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నృత్యగురువు శ్రీలత శిష్యురాలు కీర్తనతో పాటు పలువురు నృత్య కళాకారులు అమోఘంగా నర్తించారు.

విద్యార్థినిని కొట్టిన ప్రధానోపాధ్యాయురాలిపై కేసు నమోదు

గౌలిపురా: పాఠశాలకు రాలేదన్న కారణంతో విద్యార్థినిని విక్షణారహితంగా కొట్టిన ప్రధానోపాధ్యాయురాలిపై బుధవారం మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... లాల్‌దర్వాజా వెంకట్‌రావు స్కూల్‌లో స్థానికంగా ఉండే బిందు కూతురు వైష్ణవి (12) ఐదో తరగతి విద్యనభ్యసిస్తుంది. జూలైలో బాలిక తండ్రి ఈశ్వర్ మృతి చెందడంతో తీవ్ర మనస్థాపంలో ఉన్న బాలిక అప్పటి నుంచి పాఠశాలకు సరిగ్గా వెళ్లడం లేదు. ఇందులో భాగంగా ఈ నెల 4వ తేదీన తల్లి, బంధువులు సముదాయించడంతో పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో ప్రధానోపాధ్యాయురాలు వైష్ణవిని తన కార్యాలయంలోకి తీసుకెళ్లి విపరీతంగా కొట్టింది. విక్షణారహితంగా కొట్టడంతో వాతలు వచ్చాయి. ఇంటికి వచ్చిన వైష్ణవి బాధపడుతుండటంతో తల్లి గమనించింది. అనంతరం వైష్ణవిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై తల్లి ఫిర్యాదు మేరకు మొఘల్‌పురా పోలీసులు బుధవారం ప్రధానోపాధ్యాయురాలిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

న్యూసెన్స్ కేసులో తొమ్మిది రోజుల జైలు

నాంపల్లి: న్యూసెన్స్ కేసులో ఓ వ్యక్తికి కోర్టు తొమ్మిది రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.500 జరిమాన విధించింది. ఈ మేరకు మనోరంజన్ కాంప్లెక్స్ ప్రాంగణంలోని రెండవ మెట్రోపాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు తీర్పును వెల్లడించింది. హబీబ్‌నగర్‌కు చెందిన షేక్ మదర్ కుమారుడు షేక్ యూసుఫ్(46) జులాయిగా తిరుగుతుంటాడు. మద్యం తాగి కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేస్తుంటారు. రోజూ న్యూసెన్స్ చేస్తూ అందరిని భయభ్రాంతులకు గురిచేస్తున్న అతడిని హబీబ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కాగా న్యాయస్థానం అతడికి తొమ్మిది రోజుల జైలు శిక్షతో పాటుగా జరిమాన విధించినట్లు హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ అఫ్రోజ్ (ఫైల్)

గౌలిపురా: పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన మేరకు.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన సయ్యద్ అఫ్రోజ్ (26), ఆసిఫా ఫాతిమాలు దంతపలు. సయ్యద్ అఫ్రోజ్ భార్యతో గొడవపడి తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 12.30 గంటలకు అఫ్రోజ్ పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి సయ్యద్ ఫెరోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సంతోష్‌నగర్: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని బుధవారం కోర్టులో హజరు పరచగా జైలు శిక్ష, జరిమానాలు విధించినట్లు నగర ట్రాఫిక్ డీసీపీ-3 డి.శ్రీనివాస్ తెలిపారు. సౌత్ ఈస్ట్ జోన్, సౌత్ వెస్ట్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 160 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరందరిని బుధవారం కోర్టులో హజరు పరచగా న్యాయమూర్తి 25 మందికి జైలు శిక్ష విధించారన్నారు. ముగ్గురు వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారన్నారు.